విశాఖపట్టణం
గురువారం 25 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:152 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

## ప్రధాని మోడీని ఆహ్వానించిన ఇరాన్



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు ఘనంగా ..మిగతా 2లో



# పానకాల స్వామి దీక్షలో పవన్

## ప్రతీ ఏటా మాదిరి ఆధ్యాత్మిక సాధన

**(అమరావతి - జయజయహే)**

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరోసారి దీక్షలోకి ప్రవేశించారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా.. ఆధ్యాత్మిక జీవనానికి అంతే ప్రాధాన్యం ఇస్తుంటారు పవన్ కళ్యాణ్.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా తన ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించారు. బుధవారం ఉదయం మంగళగిరి పానకాల స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఏటా ఆచరించే దీక్షను ప్రారంభించారు. జ్యేష్ఠ మాసం నుంచి కార్తీక మాసం వరకు కొనసాగే ఈ దీక్ష వెనుక ఉన్న విశిష్టత ఏంటి..? పవన్ పాటించే నియమాలు ఏంటి..? మీరే చదవండి.. గురుముఖంగా స్వీకరించిన మంత్రోపదేశాన్ని ఆచరణలో పెట్టేందుకు పవన్ కళ్యాణ్ ఏటా ఈ దీక్ష చేపడుతుంటారు. జ్యేష్ఠ మాసంలో ప్రారంభమయ్యే ఈ ఆధ్యాత్మిక సాధన కార్తీక మాసం వరకు కొనసాగుతుంది. దీక్ష కాలంలో సాత్విక ఆహారం మాత్రమే తీసుకోవడం, నిత్య అనుష్ఠానాలు నిర్వహించడం, దేవతారాధన, ధ్యానం, మంత్ర పారాయణం చేయడం వంటి కఠిన నియమాలను పవన్ కళ్యాణ్ పాటిస్తారు. విధి నిర్వహణకు అనుగుణంగా సాధారణ జీవనం కొనసాగిస్తూనే ఆధ్యాత్మిక సాధనకు సమయం కేటాయిస్తారు. దీక్ష సమయంలో ఎక్కువగా చందన వర్ణ వస్త్రధారణలో కనిపించే పవన్ కళ్యాణ్... రాజకీయ బాధ్యతల మధ్య కూడా ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ దీక్షను కొనసాగించడం ఆయన ఆధ్యాత్మిక విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# ఏటా టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యం

## భవిష్యత్తులో 50 మెట్రిక్ టన్నులకు చేర్చాలి

స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ ప్రాజెక్టుకు సంస్థలు రూ. 405 కోట్ల పెట్టుబడి

విదేశాల నుంచి గోల్డ్ దిగుమతిని క్రమంగా తగ్గించాలి

రాయలసీమను మళ్లీ రతనాల సీమగా మ్చరాలి

జొన్నగిరిని స్వర్ణగిరిగా మార్చుకుందాం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభానికి శ్రీకారం



**(కర్నూలు, జయజయహే)**

జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు మాట్లాడారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బంగారు గని ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగారం శుద్ధి కర్మాగారాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జియో మైసూర్ సర్వీసెస్', 'త్రివేణి ఎర్త్ మూవర్స్' సంస్థల యాజమాన్యాలను, కార్మికులను సీఎం చంద్రబాబు అభినందించారు. జొన్నగిరి ప్రాంతానికి వందల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉందని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. 'పూర్వం అశోక చక్రవర్తి పరిపాలించిన నాలుగు ప్రధాన రాజధానులలో ఒకటైన 'సువర్ణగిరి'.. నేటి జొన్నగిరి. ఇక్కడికి సమీపంలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలే అందుకు నిదర్శనం. ఒకప్పుడు బంగారం, రత్నాలతో విలసిల్లిన ఈ ప్రాంతం పేరు కాలక్రమేణా జొన్నగిరిగా మారింది. ఇక్కడ ..మిగతా 2లో

# ఇక కరువు తాండవం..!?


ఈ ఏడాది, వచ్చే సంవత్సరం కూడా సేమ్ సీన్

భారతదేశాన్ని వదలని ఎల్ నినో ప్రభావం

బంగాళాఖాతంలో ఆందోళనకర పరిస్థితులు

నిత్యావసరాల ధరలపైనా తీవ్ర ప్రభావం

ఇన్ కాయిన్ సంస్థ బులెటిన్‌లో సంచలన అంశాలు



**(హైదరాబాద్ - జయజయహే)**

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడానికి, ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడానికి ప్రధాన కారణమైన 'ఎల్ నినో' ప్రభావం ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఈ వాతావరణ మార్పు.. రాబోయే 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల కేవలం ఈ ఏడాది మాత్రమే కాదు, 2027 ..మిగతా 2లో

# కంత్రీ సియా గోయల్..!

లోయలోకి తోయక ముందే హత్యాయత్నం

బాలి వెళ్లాల్సి ఉండగా, కేతన్ పాస్ పోర్ట్ చోరీ

33 డిగ్రీల ఎండలో హుడీ ధరించి ప్రియుడు చేతన్ చౌదరి

హుడీ ధారణపై పోలీసులకు అనుమానంతో దర్యాప్తు

తీగలాగితే బండారం బట్టబయలు



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

33 డిగ్రీల ఎండలో ఒక వ్యక్తి తలకు హుడీ వేసుకుని తిరగడం.. పూణే రూరల్ పోలీసుల అనుమానానికి బీజం వేసింది. లోహ్‌గఢ్ కోటపై ప్రమాదవశాత్తు పడి మరణించాడనుకున్న 25 ఏళ్ల యువ వ్యాపారవేత్త కేతన్ విశాల్ అగర్వాల్ కేసు.. చివరకు పక్కా స్కెచ్‌తో జరిగిన హత్యగా ..మిగతా 2లో



# గోల్డ్ డౌన్..!

ఒక్క రోజు రెండుసార్లు ధర పతనం

ఇదే దారిలో వెండి ధరలు కూడా

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

కొద్ది కాలంగా బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పసిడి ధరలు ఇవాళ సామాన్యులకు భారీ ఊరటనిచ్చాయి. మంగళవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా భారీగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా ఇవాళ ఒక్కరోజే రెండుసార్లు ధరలు భారీగా పతనం కావడం విశేషం. శుభ ముహూర్తాల వేళ బంగారం ధరలు దిగిరావడంతో కొనుగోలుదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, మార్కెట్ ఒడిదుడుకులతో ఇన్వెస్టర్లలో మాత్రం కొంత ఆందోళన ..మిగతా 2లో

# కేంద్ర కేబినెట్‌లోకి యూత్?

ఐదు రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం

అటు పార్టీలోనూ పెద్ద ఎత్తున మార్పులు

తీవ్రంగా కసరత్తు చేస్తున్న కమలనాథులు



**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 23న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్‌లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు ..మిగతా 2లో


# వీడిన సస్పెన్స్..!

సాయికృష్ణ మృతి నిజమే.. కస్టడీలో లాకప్ డెత్

చూసినట్లుగా ఎస్సై వాంగ్మూలం

సీఐ నాగరాజునే కారణం.. సిట్ రిపోర్టులో కీలక అంశాలు

**(విజయవాడ - జయజయహే)**



విజయవాడలో తీవ్ర సంచలనంగా మారిన సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు కీలక విషయాలను ప్రస్తావించారు. సాయికృష్ణను లాకప్ డెత్ చేసినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు. మృతదేహాన్ని కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో చూసినట్టు ఎస్సై వాంగ్మూలం ఇచ్చారని.. సాక్ష్యాలను నాశనం చేయడానికి , పోలీసు కస్టడీలో లేకుండా ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహే

# కంత్రీ సియా గోయల్..!



**మొదటి పేజీ తరువాయి...**

తేలింది. కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని లోనావాలా రూరల్ పోలీస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ దినేష్ తాయడే వివరించారు. కేతన్ అగర్వాల్ మంచి ట్రెకర్ అని, అంత సులభంగా లోహ్‌గఢ్ కోటపై నుంచి జారిపడే అవకాశం లేదని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు గట్టిగా చెప్పారు. దీంతో ప్రమాద కోణాన్ని పక్కనబెట్టి పోలీసులు దర్యాప్తు తీవ్రం చేశారు. జూన్ 18 ఉదయం అక్కడ 33 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కోట కింద ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించినప్పుడు, తీవ్రమైన ఎండలో ఒక వ్యక్తి హుడీ ధరించి, తల కప్పుకుని, హెడ్‌ఫోన్స్ పెట్టుకుని తిరగడం ఇన్‌స్పెక్టర్ దినేష్ తాయడే దృష్టిని ఆకర్షించింది. వాతావరణానికి ఏమాత్రం పొంతన లేని ఆ దుస్తులే పోలీసులకు తొలి క్లూగా మారాయి. "జూన్ 18 నాటి ఉష్ణోగ్రతలను పరిశీలించినప్పుడు ఆ ఉదయం 33 డిగ్రీల ఎండ ఉంది. కోట దిగువన ఉన్న సీసీటీవీ ఫుటేజీని స్క్రీనింగ్ చేస్తున్నప్పుడు ఒక వ్యక్తి హుడీ ధరించి, తల కప్పుకుని, హెడ్‌ఫోన్స్‌తో కనిపించాడు. ఆ వాతావరణంలో అలాంటి దుస్తులు వేసుకోవడం మాకు అనుమానం కలిగించింది" అని ఇన్‌స్పెక్టర్ తాయడే పేర్కొన్నారు.

ఆ హుడీ ధరించిన వ్యక్తిని సియా ప్రియుడు చేతన్ చౌదరి (22)గా పోలీసులు గుర్తించారు. పోలీసులకు దొరకకూడదనే ప్లాన్‌తో చేతన్ తన మొబైల్ ఫోన్‌ను కొంధ్వాలోని తన ఇంట్లోనే వదిలిపెట్టి కోటకు వచ్చాడు. కానీ సీసీటీవీల ద్వారా అతని కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు.. చేతన్, సియాలను గట్టిగా విచారించడంతో అసలు నిజం ఒప్పుకున్నారు. సియా తండ్రి ప్రవీణ్ గోయల్ మార్కెట్ యార్డ్‌లో మసాలా దినుసులు, డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేస్తుండగా, చేతన్ కుటుంబానికి కూడా అదే ప్రాంతంలో హోల్‌సేల్, రిటైల్ కిరాణా వ్యాపారం ఉంది. ఈ వ్యాపార పరిచయాలతోనే సియా, చేతన్‌లు గత ఏడాది కాలంగా ప్రేమలో ఉన్నారు.

**కాల్ డేటా క్లూ కూడా...**

'సక్సెస్ గ్రూప్' డైరెక్టర్‌గా ఉన్న కేతన్‌తో సియాకు ఫిబ్రవరిలో నిశ్చితార్థం అయింది. నవంబర్‌లో ఉదయ్‌పూర్‌లోని ఒక ప్యాలెస్‌లో దాదాపు రూ. 14 కోట్ల భారీ బడ్జెట్‌తో వీరి వివాహానికి ఏర్పాట్లు కూడా జరిగాయి. కానీ సియా, చేతన్‌ల బంధం కొనసాగుతూనే ఉంది. జూన్ 18న కేతన్, సియాలు కోటకు రాకముందే చేతన్ చౌదరి అక్కడికి చేరుకున్నాడు. వారు నిర్మానుష్య ప్రాంతానికి రాగానే, సియా సాయంతో కేతన్‌ను లోయలోకి నెట్టేసి హతమార్చాడు.

"సుదీర్ఘ విచారణ, కాల్ డేటా రికార్డులు , ఫోన్ లొకేషన్లు, మెసేజ్‌ల ఆధారంగా నిందితులు ఇద్దరూ కేతన్ అగర్వాల్‌ను హతమార్చడానికి కుట్ర పన్నినట్లు అంగీకరించారు" అని పూణే రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. దర్యాప్తులో మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్ కోసం కేతన్, సియాలు ఇండోనేషియాలోని బాలి వెళ్లాల్సి ఉండగా, ముంబై ఎయిర్‌పోర్టులో కేతన్ పాస్‌పోర్ట్ మాయమైంది. లోనావాలాలో ఆగినప్పుడు సియానే ఉమ్మడి పౌచ్ నుంచి ఆ పాస్‌పోర్ట్‌ను దొంగిలించిందని కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ ఆరోపించారు. అంతేకాదు, జూన్ 18 ఘటనకు నాలుగు రోజుల ముందు (జూన్ 14న) కూడా వారు లోహ్‌గఢ్ కోటకు వెళ్లారు. అప్పుడు కూడా ఎవరో తనను వెనుక నుంచి నెట్టేయడానికి ప్రయత్నించారని కేతన్ అప్పట్లో చెప్పాడని తండ్రి గుర్తు చేసుకున్నారు. అయితే పక్కనే పాము ఉందంటూ సియా డ్రామా ఆడి ఆ విషయాన్ని డైవర్ట్ చేసిందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోలీసులు భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.



# ఏటా టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

మళ్లీ బంగారు గని ప్రారంభమైనందున.. ఈ గ్రామం పేరును అధికారికంగా 'స్వర్ణగిరి'గా మార్చుకుందామా?' అని చంద్రబాబు అడిగారు. ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కేవలం పరిశ్రమకే పరిమితం కాకుండా స్థానిక ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఇందులో భాగంగానే ఈ గ్రామాన్ని సదరు సంస్థలు దత్తత తీసుకోనున్నాయని, దీనిని అత్యంత ఆధునిక సదుపాయాలతో కూడిన 'స్వర్ణగిరి మోడల్ విలేజ్'గా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక విశ్లేషణలను సీఎం చంద్రబాబు వివరించారు. 'జొన్నగిరి (స్వర్ణగిరి) గోల్డ్ ఫీల్డ్ ప్రాజెక్టు కోసం కంపెనీలు రూ.405 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాయి. తొలి ఏడాది 400 కిలోల బంగారం ఉత్పత్తితో ప్రారంభించి.. క్రమంగా ఏడాదికి 1 టన్ను బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో దీనిని 50 మెట్రిక్ టన్నుల మార్కుకు చేర్చాలని ప్రణాళికలు రూపొందించారు.' అని చంద్రబాబు అన్నారు.

# కేంద్ర కేబినెట్‌లోకి యూత్?

**మొదటి పేజీ తరువాయి...**

మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్‌లో చోటు కల్పించవచ్చు. సమాజ్‌వాదీ పార్టీ , కాంగ్రెస్‌ల వెనుకబడిన, దళిత, మైనారిటీ ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.

**పంజాబ్ నుంచి రేసులో రాఘవ్ చద్దా, తరుణ్ చుగ్, సునీల్ జాఖడ్**

వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్‌నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్‌లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్నాయి.

ఎన్నికల కంటే ముందే ఏ వర్గంలోనూ అసంతృప్తి తలెత్తకుండా ఉండేందుకు, ఇక్కడి వివిధ వర్గాల నాయకులకు కేబినెట్ లేదా పార్టీ సంస్థాగత పదవుల్లో చోటు కల్పించి సమతుల్యతను సాధించాలని బీజేపీ భావిస్తోంది.

# గోల్డ్ డౌన్..!

**మొదటి పేజీ తరువాయి...**


మొదలైంది. సోమవారం నాటి ముగింపు ధరలతో పోల్చుకుంటే, మంగళవారం ఉదయం నుంచే మార్కెట్‌లో సానుకూల మార్పులు కనిపించాయి. ఉదయం 10 గంటల సమయానికి తులం 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ. 2,070 తగ్గి, రూ. 1,45,910 వద్ద ట్రేడయ్యింది. ఉదయం తగ్గిన ధరలు అక్కడితో ఆగలేదు. ఉదయంతో పోలిస్తే 24 క్యారెట్ల గోల్డ్ రేట్ మరో రూ. 1,310 పడిపోయింది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,600 కు చేరింది. మరోవైపు ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా దిగొచ్చింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారంపై తాజాగా రూ.1,200 తగ్గడంతో, ప్రస్తుతం దీని ధర రూ. 1,32,550 గా నమోదైంది. ఇదే ధర మంగళవారం ఉదయం రూ.1,33,750గా ఉంది. ఇక 18 క్యారెట్ల తులం బంగారం రూ.1,08,450 గా ఉంది. ఈ ధర ఉదయం రూ.1,09,440 గా ఉంది.

**వెండి కూడా భారీగా డౌన్**

బంగారం దారిలోనే వెండి కూడా పరుగులు ఆపింది. కొనుగోలుదారులకు భారీ ఉపశమనం కలిగిస్తూ కేజీ వెండిపై ఏకంగా రూ.5,000 మేర ధర దిగొచ్చింది. దీంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. పెళ్ళిళ్ల సీజన్ నడుస్తున్న వేళ, తులం బంగారంపై ఒక్కరోజే ఈ స్థాయిలో భారీగా ధరలు తగ్గడం పసిడి ప్రియులకు పెద్ద ఊరట అనే చెప్పాలి. మరికొద్ది రోజులు ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

**మొదటి పేజీ తరువాయి...**



జరగబోతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆహ్వానించారు. జులై 5 నుంచి 9వ తేదీ వరకు ఖమేనీ అంత్యక్రియలను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదట టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నాయకులను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. కాగా, ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా లేదా భారత తరపున ప్రత్యేక ప్రతినిధిని పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ మధ్య ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో సహకారం కొనసాగుతోంది.



# వీడిన సస్పెన్స్..!

**మొదటి పేజీ తరువాయి...**

పోవడానికి సీఐ నాగరాజే కారణమ రాసుకొచ్చారు. సీసీ ఫుటేజ్ డేటా డీవీఆర్ లో లేకుండా చేశారని రిమాండ్‌రిపోర్టులో సిట్ అధికారులు ప్రస్తావించారు. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మెజిస్ట్రేట్ కు చేరవేయలేదని, సాయికృష్ణ మరణించాడని తల్లి స్టేషన్ కు వెళితే సీఐ నాగరాజు దూషించాడని రిమాండ్‌రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ వేసినా కూడా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదని.. హైకోర్ట్ ముందు కూడా నిజాలు దాచి, కోర్ట్ ను తప్పుదోవ పట్టించారని స్పష్టం చేసింది. ఈ పరిణామాలన్ని గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను మరణించడని గుర్తించామని.. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆదారాలు పూర్తిగా ద్వంశం చేశారని..ఈ అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందుతుడైన నాగరాజును విచారించాల్సి ఉందని సిట్ అధికారులు తెలిపారు.02.06.2026 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని తాము విశ్వస్తున్నామని.. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు.



# ఇక కరువు తాండవం..!?

**మొదటి పేజీ తరువాయి...**

వర్షాకాలంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని 'ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్' (ఇన్‌కాయిస్) తన మొట్టమొదటి ఎల్ నినో బులెటిన్‌లో సంచలన విషయాలను వెల్లడించింది. 2026 జూన్ నుండి 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో తీవ్రత ఇలాగే కొనసాగడానికి 70 నుంచి 90 శాతం అవకాశాలు ఉన్నాయని ఇన్‌కాయిస్ తెలిపింది. వాతావరణం మళ్లీ సాధారణ స్థితికి రావడానికి కేవలం 10 నుంచి 30 శాతం మాత్రమే అవకాశం ఉంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం వేసవి కాలం వరకు పొడిగిస్తే, అది ఆ తర్వాత వచ్చే వర్షాకాలంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సముద్రంలో, వాతావరణంలో మార్పులు అంత తొందరగా మారవు కాబట్టి.. 2027 నాటి రుతుపవనాలు కూడా దెబ్బతినే ప్రమాదాన్ని కొట్టిపారేయలేమని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ నినో కారణంగా ఉత్తర హిందూ మహాసముద్రంతో పాటు బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. దీనివల్ల సముద్రాల్లో వేడి గాలులు(మెరైన్ హీట్‌వేవ్స్) ఏర్పడి, సముద్ర పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుంది. బంగాళాఖాతంలో ఉష్ణోగ్రతలు మారడం వల్ల రాబోయే వేట కాలంలో రెండు ముఖ్యమైన చేపల జాతుల దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో బంగాళాఖాతంలో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉంది. తీవ్రమైన వాతావరణ మార్పుల వల్ల తీరప్రాంతాల్లో కోతకు గురికావడం, అకస్మాత్తుగా వరదలు రావడం, తుపానుల తీవ్రత పెరగడం వంటి ముప్పులు పొంచి ఉన్నాయి. బంగాళాఖాతంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే.. అరేబియా సముద్రం మాత్రం సాపేక్షంగా ప్రశాంతంగా ఉంటుందని, అక్కడ చేపల వేటకు అనుకూలమైన వాతావరణం ఉంటుందని ఇన్‌కాయిస్ పేర్కొంది. ఇన్‌కాయిస్ సంస్థ అభివృద్ధి చేసిన అత్యాధునిక 'డీప్ లెర్నింగ్ వాతావరణ నమూనాల' ద్వారా దాదాపు 15 నెలల ముందే ఈ అంచనాలను రూపొందించారు. రాబోయే రోజుల్లో వాతావరణం ఎలా ఉండబోతుందో వివరించడానికి ఇలాంటి మరిన్ని బులెటిన్లను విడుదల చేస్తామని సంస్థ ప్రకటించింది.



# నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

## లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**జయ జయహే**

నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్‌ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్‌ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గా÷-డ్గ÷న్, బాత్రూంలు, టాయిలెట్లు, ఆధునిక ఎ÷-లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి రూ.83 కోట్ల రూపాయలతో తాగునీటి శుద్ధి (వాటర్ ఫిల్టర్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ సెక్రటరి గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమిర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత, రమేశ్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# "సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో రాజకీయ, పోలీసు కోణాలపై మేడా శ్రీనివాస్ సంచలన ప్రశ్నలు"

**రాజమహేంద్రవరం: జయ జయహే జూన్ 24**



విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సాయికృష్ణ లాకప్ డెత్ కేసుపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది మేడా శ్రీనివాస్ పలు సంచలన ప్రశ్నలు లేవనెత్తారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సిఐ నాగరాజు అంతటి రిస్క్ తీసుకోవడానికి కారణాలేమిటని, ఘటన వెనుక మరెవరైనా ప్రభావశీల వ్యక్తులు ఉన్నారా అనే కోణంలో లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ హత్య కేసులో సిట్ దర్యాప్తు నిష్పక్షపాతంగా కొనసాగి, సాంకేతిక ఆధారాలను పూర్తిస్థాయిలో సేకరించాలని కోరారు. నాగరాజు అరెస్టుకు అనుకూలంగా జరిగిన ఆందోళనల వెనుక ఎవరి ప్రోత్సాహం ఉందో కూడా బయటపెట్టాలని అన్నారు. కేసు విచారణ పూర్తిగా పారదర్శకంగా జరిగితే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యే అవకాశముందని మేడా శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

# అభివృద్ధి పనులతో దూసుకుపోతున్న మంత్రి దుర్గేష్

### రోడ్లు, వైద్యం, విద్యపై కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**





రాబోయే రోజుల్లో నిడదవోలు పట్టణ రూపురేఖలను మార్చి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.బుధవారం నిడదవోలు పట్టణంలోని 22వ వార్డులో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో వైఎస్సార్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి కొత్త కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రహదారి నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన మంత్రి, పనుల నాణ్యత, అంచనా వ్యయం, కాలపరిమితి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ, త్వరలోనే ఈ ప్రాంతానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తదుపరి స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం అర్ధాంతరంగా, నిర్లక్ష్యంగా వదిలేసిన హెల్త్ సెంటర్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పూర్తి చేసిందన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు.అనంతరం సమీపంలోనిఅ ప్రాథమిక పాఠశాలను మంత్రి సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి వంట గది సౌకర్యం లేక బయటే వంట చేయాల్సి వస్తోందని వంట సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై వెంటనే స్పందించిన మంత్రి దుర్గేష్, పాఠశాలలో వంట గది నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.



## ప్రతి మాదిగ పల్లెకు తరలండి

**జయ జయహే**

జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో వేడుకలు ఘనంగా విజయవంతం చేయాలనీ మోర్తా శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా మోర్త శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం మాడుగుల అంబేద్కర్ కాలనీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా మాడుగుల నియోజకవర్గశీ కేంద్రంలో ప్రతి గ్రామంలో చైతన్య సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం జూలై 7 ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మండల అధ్యక్షుడు జల్ది అప్పారావు,టౌన్ ప్రెసిడెంట్ గోట్టివాడ పెంటారావు,మీ సీనియర్ నాయకులు వత్తల ప్రకాష్, ఎం ఈ ఎఫ్ మాడుగుల ఇన్చార్జ్ కంటిపాము పాపారావు, చిన్నశీ సునీల్ కుమార్ ,సీనియర్ నాయకులు ఎలక శ్రీను, జల్ది పైడ్రాజు ,ఏలుసు రిఈశ్వరరావు, చెవిటి రవికుమార్ ఎలకా రాజేష్, మారేడుపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ద్రవ జీవామృతం తయారీ

**మాడుగుల జూన్ 24 జయ జయహే**

మాడుగుల మండలం సాగరం కస్తూరిబాయ్ పాఠశాలలో బుధవారం దవ జీవామృతం తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐడెంటిసిటీ లో భాగంగా 1625 మొక్కలు స్కూల్లో నాటడానికి వాటికి సంబంధించిన సేంద్రియ ఎరువులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం 1200 లీటర్లు తయారు చేశారు. చేయడం ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే అప్పారావు , ఏపీ ఓ , స్కూల్ పిల్లలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. బాగా మాడుగుల మండల ఇన్చార్జి గండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ 1625 మొక్కలకి సరిపడే జీవామృతం తయారు చేశారు.



## ప్రజా రవాణా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

### విద్యుత్తు బస్సుల సేవలు ఆర్టీసీ తోనే కొనసాగాలి

### టెక్కలి ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల ధర్నా

**టెక్కలి జూన్ 24 జయ జయహే**

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టెక్కలి ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఆర్టీసీ ప్రజా రవాణా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని, విద్యుత్తు బస్సుల సేవలను ఆర్టీసి సమగ్రంగా నిర్వహించాలని ప్రవేటీకరణ చేయరాదని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న పి ఆర్ సి కమిషన్, ఐ ఆర్, పెండింగ్ డి ఎ అంశాలను ప్రభుత్వం పరిష్కరించాలని నిరసనలు తెలియజేశారు , ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు బసవల ధనుంజయ, ఎస్ మోహనరావు, రమణ మూర్తి, యూనియన్ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ సకాలంలో పూర్తి చేయాలి

**మాడుగుల జూన్ 24 జయ జయహే**

జాతీయ ఓటర్ల ప్రత్యేక పరిశీలన నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా మాడుగుల మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తాసిల్దార్ కే రమాదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాడుగుల 23వ బూత్ పరిధిలో జరుగుతున్న పరిశీలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి బిఎల్ఎ బిఎల్వోలుకు సూచనలు చేశారు. అలాగే అక్కడ కుచేరిన పలువురికి ఎస్ఐఆర్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిబ్బందికి తగు సూచనలు చేస్తూ సకాలంలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. 23వ పోలింగ్ కేంద్రం పరిధిలో కార్యక్రమం చురుకుగా జరుగుతుందంటూ ఆమె బిఎల్ఎ బిఎల్ఓ లను అభినందించారు. కార్యక్రమంలో బిఎల్ఎ కె మల్లికార్జునుడు,(నానాజీ) బిఎల్ఎ నక్క నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### లక్ష రూపాయల జరిమానా:

### అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**చోడవరం (కొత్తకోట), జూన్ 24, జయ జయహే**

అనకాపల్లి జిల్లా రావికమతం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో 2016లో నమోదైన భారీ గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. చోడవరంలోని 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.హరినారాయణ ఈ మేరకు తీర్పును వెల్లడించారని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలు పరిశీలిస్తే 2016 సెప్టెంబర్ 26వ తేదీన కొత్తకోట అప్పటి సబ్-ఇన్స్పెక్టర్ డి.శేఖరం వారి సిబ్బంది నమ్మదగిన సమాచారం మేరకు రావికమతం మండలం, దొండపూడి ఫారెస్ట్ చెక్ గేట్ వద్ద నిఘా పెట్టారు. ఆ సమయంలో కొత్తకోట వైపు నుండి వస్తున్న ఏపీ 31 టి డబ్ల్యూ 8202 నంబర్ గల మహీంద్రా బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, ఊక బస్తాల మధ్య అక్రమంగా తరలిస్తున్న 610 కిలోల గంజాయి పట్టుబడింది.

పోలీసులు వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ గంట్యాడ చిట్టిబాబును అదుపులోకి తీసుకోగా, ఈ గంజాయి రవాణా వెనుక విసంశెట్టి ముసిలినాయుడు

వాహన యజమాని అడపా సత్తిబాబుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

ప్రాసెక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాస్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను, రికార్డులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నాల్గవ నిందితుడైన (ఏ-4) డ్రైవర్ గంట్యాడ చిట్టిబాబుకు ఈ క్రింది విధంగా శిక్ష ఖరారు చేశారు. ఈ శిక్ష ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద

10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయలు

జరిమానా విధించారు. ఒకవేళ



జరిమానా చెల్లించని యెడల మరో 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాలి.

కేసులో పట్టుబడిన 610 కిలోల గంజాయిని కోర్టు సీజ్ చేసింది. ఈ కేసులోని మిగిలిన ముగ్గురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. దీంతో

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా శ్రమించిన నాటి దర్యాప్తు అధికారి, అప్పటి కొత్తకోట ఎస్సై డి.శేఖరం, ప్రాసెక్యూషన్ ను సమర్థవంతంగా నడిపిన అదనపు పబ్లిక్ ప్రాస్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ, ప్రస్తుత కొత్తకోట పోలీస్ సిబ్బందిని కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా ఇటువంటి కఠిన చర్యలు కొనసాగుతాయని, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని ఎస్పీ గారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**చోడవరం జూన్ 24 జయ జయహే**

పరవాడ ఫార్మా సిటీ లోనీ దక్షిణ్ ఎనర్జీ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన చోడవరం మండలం గోవాడకు చెందిన వేపాడ వెంకటేష్ కుటుంబాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు , ఉపాధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు ఎస్వి నాయుడు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు తారలు బుధవారం గోవాడ వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఈ ప్రమాదం జరగడానికి కంపెనీలో నిరంతరం తనిఖీలు లేకపోవడం, కార్మికుల భద్రత ను నిర్లక్ష్యం చేయడం వలనే తరచూ కంపెనీలలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిరంతరం సేఫ్టీ ఆడిట్ జరగకపోవడం, ప్రభుత్వ యంత్రాంగం పరివేక్షణ లేకపోవడం ఈ ప్రమాదాల కారణమని అన్నారు. ఇటీవల వరుసగా ఫార్మా కంపెనీలలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదం జరిగినప్పుడు అధికారులు, యంత్రాంగం హడావిడి చేస్తుంది తప్ప శాశ్వత పరిష్కారం చూడటం లేదన్నారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పేరుతో కంపెనీలకు ఒకవైపు వేగంగా అనుమతులు ఇస్తూనే కార్మికుల ప్రాణాలు మాత్రం పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన జరుగుతున్న ఈ ప్రమాదాలలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, గోవాడకు చెందిన మృతుడు వేపాడ వెంకటేష్ కి ముగ్గురు ఆడపిల్లలు చిన్నవాళ్ళు ఉన్నారని చదువుకి ప్రభుత్వం ఆదుకొని ఉచిత విద్యనే అందించాలని, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని దక్షిణ్ ఎనర్జీ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## పెళ్లిరోజున అన్నదానం

**తెనాలి జయజయహే న్యూస్:**


గుంటూరు జిల్లా, తెనాలి టౌన్ శ్రీ నాగారపమ్మ తల్లి సేవా సమితి రాయచోటి శివ వారి ఆధ్వర్యంలో కల్లూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఆచారి, నాగరత్న పెళ్లిరోజు సందర్భంగా రాయచోటి శివ సహకారంతో తెనాలి రైల్వే స్టేషన్ పరిసరాలలో నివసించే అభాగ్యులకు, వృద్ధులుకు, నిరాశ్రాయులకు మహోన్నతమైన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా నిర్వాహకులు మాట్లాడుతూ పెళ్లిరోజున అబాగ్యులకు అన్నదానం చేయడం చాలా గొప్ప కార్యమని ,దంపతులు ఇలాంటి కార్యక్రమాలు జరుపుకొని పేదవారికి అన్నదానాలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## డొక్కా సీతమ్మ పాఠశాలలో విద్యార్థులకు శక్తి టీం అవగాహన కార్యక్రమం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సారథ్యంలో నిడదవోలు డొక్కా సీతమ్మ సంస్కృత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిడదవోలు సీఐ తిలక్, ఎస్సై జగన్మోహన్, నిడదవోలు సర్కిల్ శక్తి టీం ఏఎస్సై గంగాధరరావు, మహిళా కానిస్టేబుల్ శాంతి పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం నేతల భీమారావు, పీడీ చిట్టితల్లి సమక్షంలో సుమారు 100 మంది విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం ప్రాముఖ్యత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన, బాల్యవివాహాల నివారణ, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు.మహిళలు, చిన్నారుల రక్షణకు ఉన్న చట్టాలు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల బైక్‌లు, కార్లలో ఎక్కరాదని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆడపిల్లలు పాఠశాల నుంచి ఇంటికి, ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే సమయంలో ఒంటరిగా కాకుండా తోటి విద్యార్థులతో కలిసి వెళ్లాలని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.




## కృత్రిమ మేధస్సు నా స్నేహితుడు (ఏఐ)

పరోక్షంగా మనుషుల ఆలోచనలు...
ఆధునిక పద్ధతులు...
తీసుకునే నిర్ణయాలు... ఈ "ఏఐ" స్నేహితుని ద్వారా
కంప్యూటర్లు... వేగవంతంగా (ఏ) ఎనలేని (ఐ ) ఐడియాతో ఎలా అందిస్తాయో తెలుసుకుందాం గురూజీ.

నీ ఫోటో చూసి నిన్ను గుర్తుపట్టడం,
నీతో చాట్ చేయడం...
నువ్వు వెళ్లే గమ్యానికి రూట్ మ్యాప్ చూపించడం,
నువ్వు అడిగే ప్రతి ప్రశ్నకు మనిషిలా స్పందించేలా
ట్రైనింగ్ ఇచ్చిన టెక్నాలజీ ఇది గురూజీ.

24 గంటలు... విశ్రాంతి లేకుండా
ఒక సెకనులో లక్షల డేటా చదివి
సమాధానం ఇవ్వగల నేర్పరి...
అంతేనా... పజిల్స్... కోడింగ్... కౌంటింగ్...
కౌంటర్ వేయడంలో గడసరి... ఈ "ఏఐ" గురూజీ.

అయితే ఎక్కువ వెంటబడితే...
నెత్తి ఎక్కి డాన్స్ చేస్తుంది.
మనలా తలనొప్పి వస్తే టీ తాగదు...
బోర్ కొడితే గోదావరి ఒడ్డున కూర్చుని సేదతీరదు.
అందుకే ఫీలింగ్ లేని వస్తువుతో తస్మాత్ జాగ్రత్త... జీ గురూజీ.

సులువు కదా అని అన్నింటిలో
"ఏఐ" పై ఆధారపడ్డామా...
మీరు బోల్తా పడ్డట్టే...
ఇది 100% కరెక్ట్ కాదు. అందుకే ప్రతి ముఖ్య విషయం క్రాస్ చెక్ చేసుకోవడం ఉత్తమం....
ఒక్కసారి తప్పుడు సమాచారం ఇచ్చే చమత్కారి గురూజీ.

కృత్రిమ స్నేహంపై ఎక్కువ ఆధారపడి బ్రతుకుదాం అనుకుంటే
బతుకు జట్కా బండే.
ఒక్కోసారి మన బుర్ర మొద్దుబారిపోతుంది.
బుర్రలో జ్ఞానం విత్తనాలు, మొక్కలు బదులు
మట్టిని మొలిపిస్తాయి గురూజీ.

కొంతమంది జీవనోపాధిగా ఉండే
టైపింగ్... కస్టమర్ సపోర్ట్... కంటెంట్ రైటింగ్
వంటి ఉద్యోగాలు ఈ "ఏఐ"తో పోతాయి గురూజీ.


"ఏఐ"తో మరో ప్రమాదం...
మనకంటూ ఒక రహస్యం ఉండదు.
మనం వెతికేవి... అడిగేవి స్టోర్ చేసి
మన గుట్టు రట్టు చేసి రచ్చకీడ్చే ప్రమాదం ఉంది గురూజీ.

చరవాణితో మనం చెరువ కావడంతో...
మన కుటుంబంతో, స్నేహితులతో...
చివరికి మన పిల్లలు, మన జీవిత భాగస్వామితో
దూరం పెరగడం కొంత అయితే...
దానితో పాటు బోనస్...
ఈ "ఏఐ" కనీసం అవసరం అనుకున్నప్పుడు
మాట్లాడుకోవడం అనే అవకాశం కూడా
పూర్తిగా దూరం చేస్తుంది గురూజీ.

దానికోసం కూడా మనం "ఏఐ" ని అడిగితే ఏమంటుందో తెలుసా గురూజీ...
"నీలా నాకు సొంతంగా కొత్త కలలు...
ప్రణాళికలు... ప్రేమలు... ద్వేషాలు...
అభిమానం... అనురాగం...
జాతి... మతం... కులం, ప్రాంతం లేవు.
నేను కేవలం ఒక టూల్.
నువ్వు ఎలా వాడుకుంటావో దాని మీద
నేను ఆధారపడి ఉంటా"
అని నంగనాచిలా చెబుతూ...
చరవాణిలో మాత్రం నక్షత్రంలా మెరుస్తుంది ఈ "ఏఐ" గురూజీ.

అంతేగా...
మన అరచేతిలో ఈ చరవాణి
మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనకు దూరం చేసి...
ప్రపంచంలో ఉండే అన్ని విషయాలను
చరవాణి రూపంలో మన అరచేతుల్లో ఉంచుతుంది గురూజీ.

దాన్ని మనం మంచికి, మేధస్సుకు ఉపయోగిస్తామో...
మన ఉనికిని మనం కోల్పోయే అజ్ఞానము అనే అగాధంలో కూరుకుపోతామో...
అది మన చేతిలోనే గురూజీ.



కలం : వసంత కోకిల
రచన :డా. జి. మాలతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు
డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల
విశాఖపట్నం.

# జలుబు, దగ్గుతో బాధపడుతున్నారా?

## వాము వాడండి!! ఉపశమనం పొందండి!!!

(పుట్టా శ్రీనివాసరావు)



వాముఆకుమొక్క చిన్నపిల్లలు ఉండే ఇంట్లో ఈ మొక్క తప్పనిసరిగా ఉండాలి.

దగ్గు,జలుబు ఉంటే ఆకులో మిరియాలు,ఉప్పు వేసుకుని నమిలి మింగితే ఉపశమనం లభిస్తుంది.

చిన్నపిల్లలకు అయితే ఈ ఆకుకి కొద్దిగా సెగబెట్టి రసంపిండి ఆ రసం తాపిస్తే తగ్గుతుంది.

ఎవరి ఇండ్లలో అయినా ఈమొక్కఉంటే కొద్దిగా తుంచుకుని నాటుకున్నా బ్రతికేస్తుంది.

వాము ఆకులతో బజ్జీలు మాత్రమే చేసుకుంటారని అనుకుంటారు చాలా మంది నిజానికి సాధారణ జలుబు నుంచి ఉపశమనం పొందడానికి ఇది ఎంతగానో ఉ పకరిస్తుంది. వాము ఆకులతో చేసే రసం పెరుగు పచ్చడి రుచితో పాటు అనేక పోషకాలనీ అందిస్తాయి. కొత్త ఆకులను తెంపి వాడుకోవచ్చు అలా మొక్కలను పెంచుతూ నే ఆకులను నెలల తరబడి వాడుకోవచ్చు.వాము ఆకుల నుంచి వచ్చే సువాసనతో ఇంటి పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయి.దీన్ని మిగతా ఆకు కూరలు మాదిరిగానే అన్ని వంటకాల్లో వాడుకోవచ్చు.

**వాము ఆకులు ఉపయోగాలు గురించి తెలుసుకుందామా.**

ప్రతి ఇంట్లో పోపుల పెట్టెలో ఉండే సుగంధ ద్రవ్యం వాము.దీని పుట్టినిల్లు భారతదేశం రుచికి శుచికి ఆరోగ్యానికి వాము పెట్టింది పేరు.ఈ మొక్కలోని అన్ని భాగాలకు ఘాటైన వాసన ఉండటం వల్ల సంస్కృతంలో దీన్ని ఉగ్రగంధ అంటారు. వాములో పీచు ఖనిజ లవణాలు విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి దీన్ని పచ్చిగా వేయించి కూడా వాడుకోవచ్చు.నీటిలో కలుపుకుని కూడా తాగొచ్చు.తేనీటిలో వేసుకొని తాగోచ్చు జలుబు జీర్ణ సంబంధ సమస్యలు ఇట్టే దూరం అవుతాయి.వాము మొక్కలను పెరట్లో లేదా తోటెల్లో పెంచుకుని తాజా ఆకులను వివిధ వంటకాల్లో వాడుకోవచ్చు. గుండె పోటుకు కారణమయ్యే కొలెస్ట్రాల్ ట్రైగ్లిసరైడ్ స్థాయులను తగ్గిస్తుంది అధిక రక్తపోటును అధిక ఒత్తిడి ని తగ్గిస్తుంది.వాములో ఉ ండే యాంటీ బయోటిక్ అనస్తిటిక్ విలువల వల్ల కాళ్ల నొప్పులు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతుంది పొట్టలో ఆమ్లత్వాన్ని తగ్గిస్తుంది.అందుకే చిన్న పిల్లల్లో గ్యాస్ అజీర్తి తగ్గించే సిరప్ లలో వాము నీటిని ఎక్కువగా వాడతారు

వాము ఆకులను నీటిలో ఉడికించి తాగితే దగ్గు జలుబు తగ్గుతాయి ఈ ఆకులతో చేసిన పకోడీలు తినడం వల్ల అజీర్తి సమస్య తగ్గుతుంది పచ్చళ్లు చట్నీలలో రుచి కోసం వాడుతారు.రంగు రుచి కోసం పండ్ల రసాలు పానీయాల్లో కూడా వాడుతుంటారు. పొట్టలో సమస్యలను తగ్గించడానికి వాము ఆకు చాల ఉపయోగపడతాయి.ఇది ఆకలిని పెంచుతుంది వాము లో ఉండే థైమోల్ అనే రసాయనం శిలీంద్రాలు సూక్ష్మజీవుల పై పని చేస్తుంది నీటిలో కాస్త వాము వేసుకుని తాగితే జీర్ణ శక్తి పెరుగుతుంది. కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో ఉపయోగపడుతుంది. వెంట్రుకలు తెల్లబడకుండా చేసే శక్తి వాముకు ఉంది.

**వాము మొక్కలు ఎలా పెంచాలి**

ఈ వాము మొక్కలను ఎలా పెంచాలంటే వాము ను విత్తనాల ద్వారా పెంచుకోవచ్చు.కంపోస్టు కొబ్బరి పీచు మిశ్రమాన్ని ట్రేలో గానీ సిమెంటు తొట్టెలో గానీ నింపి అందులో పై పైన వాము గింజలు చల్లాలి. ఆ తర్వాత పైన పల్చగా మట్టిని వేయాలి.నీడ ప్రదేశంలో ఉంచి ఉదయం సాయంత్రం నీటిని తుంపరలుగా చల్లాలి.వారం నుంచి రెండు వారాల్లో మొలకెత్తుతాయి.సూర్యరశ్మి ఎక్కువగా అవసరం లేదు.కొద్దిగా ఎండపడే ప్రాంతంలో ఉండేలా చూసుకోవాలి. ఆకులు ఎండి పోతే తెంపి పారేయాలి.పురుగులు పడితే వేప నూనె పిచికారీ చేయాలి.తొట్టి లోని మట్టి తడారకుండా చూసుకోవాలి.కాబట్టి మీరు కూడా వాము ఆకులను వాడి చూడండి ఆరోగ్యం గా ఉండండి

# శాంతిపై అమెరికా ఇరాన్ల దోబూచులాట

(సి.హెచ్.ప్రతాప్)



అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధం ముగిసిందా? లేక తాత్కాలిక విరామం మాత్రమేనా? ప్రస్తుతం ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రశ్న ఇదే. ఒకవైపు ఇరు దేశాలు శాంతి చర్చలు, కాల్పుల విరమణ ఒప్పందాల గురించి మాట్లాడుతుండగా, మరోవైపు హోర్ముజ్ జలసంధి విషయంలో కొనసాగుతున్న వివాదాలు ఆ శాంతి ఎంత స్థిరమైనదో అన్న సందేహాలను రేకెత్తిస్తున్నాయి.

హోర్ముజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన మార్గం. ప్రపంచ సముద్ర మార్గాల ద్వారా తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంది. అందువల్ల అక్కడ ఏర్పడే చిన్న ఉద్రిక్తత కూడా అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపుతుంది.

ఇటీవలి వారాల్లో అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినట్లు ప్రకటించబడింది. అయితే ఆ ఒప్పందంలోని నిబంధనల అమలు విషయంలో భిన్నాభిప్రాయాలు బయటపడుతున్నాయి. ఇరాన్ తన భద్రతా ప్రయోజనాలను ప్రస్తావిస్తుండగా, అమెరికా అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలకు ప్రాధాన్యం ఇస్తోంది.

ఈ పరిస్థితి "దాగుడుమూతల దౌత్యం"గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాటల్లో శాంతి, చేతల్లో అనుమానం కనిపిస్తోంది. ఒక రోజు చర్చలు సానుకూలంగా సాగుతున్నాయనే వార్తలు వస్తే, మరుసటి రోజు జలసంధి వినియోగంపై కొత్త వివాదాలు వెలుగులోకి వస్తున్నాయి.

దీని ప్రభావం ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే పడుతుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరుగుతుంది. ద్రవ్యోల్బణం ఒత్తిడి పెరుగుతుంది. ఇంధన దిగుమతులపై ఆధారపడే భారతదేశం వంటి దేశాలు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం అవసరం. అందుకోసం అమెరికా, ఇరాన్ తమ వ్యూహాత్మక విభేదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి. హోర్ముజ్ జలసంధి ఒక దేశానికి చెందినది కాదు; అది ప్రపంచ వాణిజ్యానికి జీవనాడి. అక్కడ అనిశ్చితి కొనసాగితే దాని ప్రభావం ప్రాంతీయ స్థాయిని దాటి ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది.

అంతేకాక, ఈ ఉద్రిక్తతలు ఇంధన భద్రతపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, పునరుత్పాదక శక్తి, వ్యూహాత్మక చమురు నిల్వలపై మరింత దృష్టి సారిస్తున్నాయి. ఒకే జలమార్గంపై అధిక ఆధారపడటం ఎంత ప్రమాదకరమో హోర్ముజ్ సంక్షోభం మరోసారి గుర్తు చేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్యసమితి, ప్రాంతీయ శక్తులు మధ్యవర్తిత్వం చేసి ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం, ఇంధన భద్రత పరస్పర సంబంధిత అంశాలని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

యుద్ధం గెలిచినవారిని సృష్టించవచ్చు. కానీ శాంతి మాత్రమే భవిష్యత్తును నిర్మిస్తుంది. అందుకే ప్రస్తుతం అవసరమైనది శక్తి ప్రదర్శన కాదు, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే దౌత్యం.

# విద్యకు అండగా టివిసి ట్రస్ట్.. పేద విద్యార్థికి ఆర్థిక సాయం

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 24**



కడియం,సమాజ అభివృద్ధికి విద్యే బలమైన ఆయుధమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకూడదనే లక్ష్యంతో టివిసి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని ట్రస్ట్ అధినేత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి పేర్కొన్నారు.బుధవారం కడియం మండలం బుర్రిలంక గ్రామంలోని శ్రీ ఈశ్వర ఫార్మ్స్ అండ్ నర్సరీలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో రాజమహేంద్రవరానికి చెందిన పేద విద్యార్థి టి. సుధీర్ ఉన్నత విద్యాభ్యాసానికి రూ.5,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్ తరపున ఆయన కుమారుడు తాడాల కృష్ణకుమార్ విద్యార్థికి అందించారు.ఈ సందర్భంగా తాడాల విష్ణు చక్రవర్తి మాట్లాడుతూ, "పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో కలిసిపోకూడదు. చదువుకోవాలనే తపన ఉ న్న ప్రతి విద్యార్థికి సమాజం అండగా నిలవాలి. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తమ కుటుంబాలకు, సమాజానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి. టీవీసీ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పటికీ విద్య, వైద్యం, సామాజిక సేవల రంగాల్లో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ పేదలకు అండగా నిలుస్తుంది" అని అన్నారు.భవిష్యత్తులో కూడా విద్యార్థి విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందించేందుకు ట్రస్ట్ సిద్ధంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ట్రస్ట్ అందించిన సహాయానికి విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి టి. సాల్మన్, చిలుకూరి రామకృష్ణ, బి. చంద్రకుమారి, కె. కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కడియం పేపర్ మిల్లుపై మంత్రి కందుల సంచలన హెచ్చరిక

## "కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళనే!"

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 24:**

కడియం పేపర్ మిల్లులో తొలగింపులకు గురైన 70 మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయడంలో యాజమాన్యం విఫలమైతే తాను స్వయంగా కార్మికులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటానని హెచ్చరించారు. పేపర్ మిల్లు యాజమాన్యం తొలగించిన 70 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు గత 59 రోజులుగా కొనసాగిస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని బుధవారం మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరిని తీవ్రంగా ఖండించారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని, అయితే సంస్థ అభివృద్ధికి తమ శ్రమను అంకితం చేస్తున్న కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన యాజమాన్యం, బెదిరింపులు, లాకౌట్‌లు, తొలగింపుల వంటి చర్యలకు పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ జోక్యంతో లాకౌట్ ఎత్తివేయబడినప్పటికీ 59 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం, వారికి మద్దతుగా నిలిచిన 11 మంది పర్మినెంట్ కార్మికులపై కూడా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఈ అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా, శాంతియుతంగా పోరాటం కొనసాగించడం



అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తాను కార్మికుల పక్షాన నిలుస్తానని, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఇప్పటికే పేపర్ మిల్లు యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్‌లతో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు వేచి చూస్తామని, ఈలోపు యాజమాన్యం తన మొండి వైఖరిని వీడి కార్మికులకు న్యాయం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. లేకపోతే తాను కార్మికులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతానని, ఆ పరిస్థితుల్లో జరిగే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి. అరుణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. పవన్, జిల్లా అధ్యక్షులు ఎం. సుందర్‌బాబు, కర్రి రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, పేపర్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.



# కిక్ బాక్సింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న : శివకుమార్

**విశాఖపట్నం జయ జయహే)**

విశాఖ పశ్చిమ నియోజకవర్గం 56వ వార్డు కంచరపాలెం ఆర్ పి వేట ఉన్నత పాఠశాల ఆవరణంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు మేరకు జోనల్ కమిషనర్ హైమావతి పర్యవేక్షణలో అల్ ఇండియా ఎన్సీంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, టైగర్ కిక్ బాక్సింగ్ కౌన్సిల్ అసోసియేషన్ సీనియర్ మాస్టర్ గుండి జానకి రాము ఆధ్వర్యంలో జీవీఎంసీ వారి ఉచిత కిక్ బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ తరుణంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో కిక్ బాక్సింగ్ నేర్చుకున్న విద్యార్థులకు జీవీఎంసీ ఇచ్చిన సర్టిఫికెట్స్,టీ షర్ట్ లు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా టిడిపి యూత్ నాయకులు, మాజీ బాక్సింగ్ కోచ్ ఎలుసురి శివకుమార్ చేతుల మీదగా సర్టిఫికెట్స్,టీ షర్ట్ లను విద్యార్థులకు పంపిణీ చేసి, అనంతరం కిక్ బాక్సింగ్ నేర్చుకుంటున్న పిల్లలకు ఆయన సొంత నిధులతో పాలు ప్యాకెట్, టాటా గ్లూకోజ్ ప్యాకెట్,బిస్కెట్ ప్యాకెట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ కరాటే, కిక్ బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకొని మీయొక్క ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి,క్రీడారంగంలో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టి ఎన్ ఎస్ ఎఫ్ లీడర్ పీలా లక్ష్మి అవినాష్, కరాటే కిక్ బాక్సింగ్ మాస్టర్ గుండి జానకి రాము, అసిస్టెంట్ కోచ్ బి భరత్,గుండి యశోద్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# నసా ముక్తభారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం

**చోడవరం జూన్ 24 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో బుధవారం నశాముక్తభారత్ అభియాన్ " కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వము మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము , కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ , స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి జీవితాన్ని నాశనం చేసుకున్నటే గాక వారి తల్లిదండ్రులను కూడా ఇబ్బందులకు గురి చేసిన వారవుతున్నారని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. మరో ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ సైబర్ క్రిమినల్, బాల్య వివాహాల చట్టాలు, బాలికల వేధింపులు, సమాజంలో యువత బానిసలుగా మారుతున్న వివిధ అంశాలతో పాటు, వివిధ చట్టాలు అంశాల గురించి సవివరముగా తెలియజేశారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలంటే విద్యార్థులకు యోగాసనాలు, మానసిక ఒత్తిడి కార్యక్రమాలను గురించి తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఈ యోగా కార్యక్రమాలు అత్యవసరమని, దీని ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతోపాటు, విజ్ఞానంపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐవివి సత్యవతి, సమన్వయకర్త నారాయణమూర్తి, జాతీయ సేవా విభాగం ప్రోగ్రాం ఆఫీసర్స్ బి పిచ్చమ్మ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు డాక్టర్ వాసు దేవరాజు, సీనియర్ అధ్యాపకులు వీ అప్పలనాయుడు, సమన్వయకర్త డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ మల్లీబాబు, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ సంధ్య శ్రీ, శ్రీ వెంకటేష్, సరస్వతి, రామలక్ష్మి డాక్టర్ సంతోష్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



### చిన్నారుల "భవిష్యత్ వికాసమే"

# లక్ష్యం కావాలి

**శ్రీకాకుళం. (జయ జయహే )**

చిన్నారుల భవిష్యత్ వికాసమే అందరి లక్ష్యం కావాలని, నగర ప్రముఖులు అన్నారు. స్థానిక పాలకొండ రోడ్, పెద్ద రెల్లివీధిలో శిశుపాల్ డే కేర్ అండ్ ప్రీ స్కూల్ 2వ శాఖను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా లయన్ నటుకుల.మోహన్, ప్రముఖ వైద్యులు డా. పైడి.సింధూర ఈఎన్టి, జనరల్ ఫిజీషియన్ డా.బొడ్డేపల్లి.సురేష్ పాల్గొని, జ్యోతి ప్రజల్వన అనంతరం, ఆణిముత్యాలైన చిన్నారులు చేసిన నాట్యాలను తిలకించి, శిశుపాల్ డే కేర్ అండ్ ప్రీ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ముత్యాల.గౌతమితో కలసి ప్రారంభించారు. వైద్యులు డా. పైడి.సింధూర, డా.బొడ్డేపల్లి.సురేష్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థాపకులు లయన్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలు, నిపుణులతో విద్యా బోధనే లక్ష్యంగా శిశుపాల్ డే కేర్ అండ్ ప్రీ స్కూల్ ఆలోచనని, చిన్నారుల చిరునవ్వే వారి ధ్యేయమని అన్నారు. పిల్లలకు అన్ని సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, రెండవ శాఖను ప్రారభించటం అభినందనీయమని, వారి నమ్మకము, ఉత్తమ బోధన, చిన్నారులను చదువుతోపాటు, వారి సంరక్షణ ముఖ్యమని, ఆ బాధ్యతను నిర్వహిస్తూ నగరంలో మంచి పేరు సంపాదించారని అన్నారు. ముఖ్యంగా వీరికి సహకరిస్తున్న అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలని, భవిష్యత్ తరానికి, శిశుపాల్ డే కేర్ అండ్ ప్రీ స్కూల్ వేదిక కావాలని, మేనేజింగ్ డైరెక్టర్ ముత్యాల.గౌతమికు శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిధుల చేతుల మీదుగా నాట్యమయూరులకు, జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శిశుపాల్ డే కేర్ అండ్ ప్రీ స్కూల్ యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది, చిన్నారుల తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



# సంపగూడలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కార్యక్రమం

**అరకులోయ: జయ జయహే.**

అరకు వేలి మండలం మాడగడ పంచాయతీ సంపగుడ గ్రామంలో సర్వే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు అరకు టిడిపి పార్టీ ఇంచార్జ్ విజయనగరం జోనల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో మాడగడ పంచాయతీ టిడిపి పార్టీ అధ్యక్షులు కొర్ర సుబ్బారావు సమక్షంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ ఉద్దేశించి పంచాయతీ పరిధిలో బి ఎల్ ఓ. లతో కలిసి బిఎల్ఎ లు కూడా గ్రామంలోని ఇంటింటికి డోర్ టు డోర్ వెళ్లి సమగ్ర విసరణ జరిపి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఓటరు హక్కు కలిగిన ప్రతి ఒకరు తమ వివరాలను పూర్తిగా తెలపాలని అప్పుడే మీ ఓటు గల్లంతు అవకుండా ఉంటుందని బిఎల్ఎ. ఎస్ ఐ ఆర్. కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కె శేఖర్ . కే జగబంధు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఇబ్బందులు క్రీడలకు ఆటంకం కాకూడదు: గురాన రాధిక

**విజయనగరం, జూన్ 24:(జయ జయహే )**

చిత్తూరు జిల్లాలో జరగనున్న అండర్-23 రెజ్లింగ్ పోటీలకు విజయనగరం జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులకు 'గురాన అయ్యలు ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్' అండగా నిలిచింది. పోటీలకు వెళ్లనున్న క్రీడాకారులకు ట్రస్ట్ అధ్యక్షురాలు గురాన రాధిక బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గురాన రాధిక మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఆర్థిక ఇబ్బందులు ఏమాత్రం ఆటంకం కాకూడదన్నదే తమ ట్రస్ట్ యొక్క ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో కూడా క్రీడాకారులకు తమ ట్రస్ట్ తరపున ఇలాంటి ప్రోత్సాహం, సహకారం ఎల్లప్పుడూ ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు. ట్రస్ట్ ద్వారా అందిన ఈ ఆర్థిక ప్రోత్సాహంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సహాయం అందించి తమకు కొండంత అండగా నిలిచిన గురాన రాధికకు వారు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల ఆరోగ్య భరోసాకు సీఎం సహాయనిధి అండ

## 38 మందికి రూ.27.30 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల"

**రాజమహేంద్రవరం : జయ జయహే : జూన్ 24**

పేద ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా పేదల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. బుధవారం ఉదయం గోరంట్ల వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ పరిధిలోని రూరల్ మండలం, కడియం మండలం మరియు వివిధ వార్డులకు చెందిన 38 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 27.30 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల ఆరోగ్య రక్షణ కోసం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనేక వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని అత్యవసర వైద్య చికిత్సలకు లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేస్తున్నామని, చికిత్స అనంతరం వచ్చిన భారీ ఖర్చులను తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 528



మంది లబ్ధిదారులకు రూ. 5.22 కోట్ల ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులు పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించి, ఆర్థికంగా ఊరటనిస్తున్నాయని పేర్కొన్నారు. రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, గంగిన హనుమంతరావు, కురుకూరి కిషోర్, కామిని ప్రసాద్, దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన శ్రీను, శీలం



గోవిందు, రొంపిచర్ల ఆంటోనీ, చలమూరు సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టికూటి దత్తుడు, పల్లి సాయి, ఏడాకుల వెంకటేశ్వరరావు, వడ్డీ వరప్రసాద్, భీమరశెట్టి రమేష్, నిచ్చెనకోళ్ళ సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, పుక్కళ్ళ రాజు, గుబ్బల దశరథ్, కసిరెడ్డి దుర్గాప్రసాద్, చిర్చారి సుబ్బారావు, మార్ని దొరబ్బాయి, గోరు నాగేశ్వరరావు, దొంతలశెట్టి శ్రీనివాస్, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మధురవాడ పరిసరాలు...మాదాపూర్..కొండాపూర్ స్థాయిలో...!

## వీఎంఆర్‌డీఏ ఎంఐజీ హౌసింగ్ ప్రాజెక్టు భూమిపూజలో ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం, జూన్ 24, జయ జయహే :**

వి ఎం ఆర్ డి ఎ అధ్వర్యంలో పి పి పి విధానంలో నూతనంగా చేపడుతున్న రెండు ప్రధాన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఎండాడ లా కళాశాల రోడ్ లో వి ఎం ఆర్ డి ఎ, అధ్వర్యంలో వికసిత్ భరత్, స్వర్ణ ఆంధ్రా లక్ష్యాన్ని చేరుకునేలా విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిలో భాగంగా పి పి పి విధానంలో చేపడుతున్న వైజాగ్ వర్చువల్ రియాలిటీ సెంటర్, 3స్టార్ హోటల్ ప్రాజెక్ట్ కి, మిథిలాపురి లో చేపడుతున్న ఎం ఐ జీ హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ పాల్గొని శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విశాఖ అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. విశాఖ, భోగాపురం విమానాశ్రయానికి మధ్య ఉన్న మధురవాడ పరిసరాలు హైదరాబాద్ గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ తరహాలో అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, ఎ ఐ హబ్ గా మారనున్న నేపథ్యంలో వీఎంఆర్‌డీఏ అధ్వర్యంలో పీపీపీ విధానంలో వర్చువల్ రియాలిటీ సెంటర్ నిర్మాణం జరపటం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు రావటంతో



పర్యాటకానికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. అదే విధంగా విశాఖ లో సొంత ఇల్లు ఉండాలని ప్రతీ ఒకరి ఆశ అని, వారి కోరిక మేరకు ఎం ఐ జీ హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకోసం నగర వాసుల అభిప్రాయ సేకరణ చేపట్టామని పేర్కొన్నారు. నగరవాసులకు నాణ్యత తో కూడిన నివాసాలను అందించనున్నామన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు మూడేళ్ల లో పూర్తి కానున్నాయని, వీటి ద్వారా వి ఎం ఆర్ డి ఎ ఆదాయం సమకూరనుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, కార్యదర్శి మురళీ కృష్ణ, ఒ ఎస్ డి కృష్ణ నాయక్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి దివ్య లత, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఆర్ అండ్ ఆర్ కాలనీలో

# తాగునీటి ఎద్దడి

## తాడువాయి నిర్వాసితులకు తప్పని తిప్పలు.

**జంగారెడ్డి గూడెం -జయ జయహే**

జంగారెడ్డిగూడెం రూరల్ మండలం తాడువాయి పంచాయతీ పరిధిలో గల చల్ల వారి గూడెం అర్ అండ్ ఆర్ కాలనీ లో నివాసం ఉంటున్న కుటుంబాలవారు గత 4రోజులు గా నీళ్ళ లేక నా నా ఇబ్బందులు పడుతున్నామని తాడువాయి పంచాయతీ కార్యదర్శి కి మొర పెట్టు కున్నారు.కాలనీ వసూలకనీస అవసరాలకి వాడు కోవడానికి కూడా నీళ్ళు లేకపోతే ఎలా? అంటూవారు బుధవారం తా డవాయి పంచాయతీ సెక్రటరీ నీ కలిసి తమ బాధలు చెప్పుకున్నారు.అంతకు ముందు కాలనీలో పని చేస్తున్న గుత్తేదారు సంస్థ యూనిక్ ప్రతినిధులకు గ్రామస్థులు అందరూ కలిసి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకొన్నారు.అనంతరం తా డువాయి పంచాయతీకి వెళ్లి ఎన్ని సార్లు ఆ ఆఫీస్ చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.పలుమార్లు అధికారులు కి మొర పెట్టుకున్నా మా సమస్య మాత్రం పరిష్కారం అవడం లేదు అంటూ తన ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్న ఎనిమిది వందల కుటుంబాలకి ఒక్క ట్యాంక్ఉన్నదని ఏ విధంగా సరిపోతుంది ,మోటర్ గెట్ వాళు లు పాడైపోయాయని .వాటికి పరిష్కార మార్గంగా మిగిలిన ట్యాంక్ ల ద్వారా పైపుల కలెక్షన్ ఇవ్వాలని కోరారు.వీటన్నిటిని విన్న పంచాయతీ సెక్రటరీ వారం ,పది రోజుల్లో మోటర్ రిపేర్ చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారన్నారు ఈ కార్యక్రమంలో అర్ అండ్ ఆర్ కాలనీ కమిటి సభ్యులు బద్దె.ప్రేమ్ కుమార్,పెరుమాళ్ళ శ్రీను,నరసింహా రావు,గుబ్బల విజయ్ బాబు,ముత్తబోయిన రమణయ్య, వలపర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు



### వైభవంగా శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి

# పున: నూతన శిఖర ప్రతిష్ట

## హాజరైన మంత్రి కొండపల్లి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

**విజయనగరం, జూన్ 24, జయ జయహే :**

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి పునః నూతన శిఖర ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవం వేడుకల్లో భాగంగా బుధవారం జరిగిన గ్రామ ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల నుంచి ప్రారంభమైన ఈ ప్రదక్షిణ కోట, సింహాచలం మేడ జంక్షన్, బాలాజీ జంక్షన్, గంట స్తంభం జంక్షన్ మీదుగా తిరిగి అమ్మవారి కోవెలకు చేరుకుంది. మార్గమంతా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మేళ తాళాలు ఈ మహోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గకుండా వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అవునాపూ విజయ్ విజయ నగరానికి ప్రసిద్ధిగాంచిన 'పులి వేషాల' వారితో ఉత్సాహంగా పాల్గొనడం విచ్చేసిన భక్తులందరినీ ఆకట్టుకుంది. అనంతరం మంత్రి ,ఎంపీ, ఎమ్మెల్యే తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.



### ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి

## ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు

**మధురవాడ , జూన్ 24, జయ జయహే**

చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకువస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. బ్రిడ్జి పనుల పురోగతిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అధికారులు పనుల ప్రగతిని వివరించారు. రూ.3.29 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల చంద్రంపాలెం హైస్కూల్ కు వెళ్లే విద్యార్థులతో పాటు జాతీయ రహదారి మధ్య రాకపోకలు సాగించే వేలాది మందికి ప్రజలకు సౌకర్యం చేకూరుతుందని గంటా పేర్కొన్నారు. కార్యక్రమంలో మధురవాడ జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాదు వెంకటప్పుడు, నాగోతి సత్యనారాయణ, మాన్యాల సోంబాబు, నాగోతి సూర్యప్రకాష్, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి గోపీ, బోయి రమాదేవి, పోతిన ప్రసాద్, తమ్మిన సూరిబాబు, ఎస్.ఎం.సి. చైర్మన్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి మన్యం జిల్లాలో కల్తీ సరుకులు

## గడువు తీరిన వంట నూనెలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

## వారపు సంతలలోనూ విస్తృత తనిఖీలు చేపట్టాలి

## ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు

**విశాఖపట్నం, జూన్ 24, జయ జయహే :**



అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వంట నూనెల విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు పేర్కొన్నారు. గిరిజనుల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాటమాడే ఇటువంటి అక్రమ వ్యాపారాలపై ప్రభుత్వం, ఆహార భద్రత శాఖ, సివిల్ సప్లైస్ మరియు సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లాలో నిర్వహించే వారపు సంతలలో ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేకుండా విక్రయిస్తున్న ఆహార పదార్థాలు, గడువు ముగిసిన వంట నూనెలు, కల్తీ సరుకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. వారపు సంతలు గిరిజనుల ప్రధాన కొనుగోలు కేంద్రాలు కావడంతో అక్కడ విక్రయించే వస్తువుల నాణ్యతను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలు, రేషన్ దుకాణాలు, వారపు సంతలలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి కల్తీ సరుకులు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఆహార భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు గారు అన్నారు. గిరిజనుల ఆరోగ్యం, ప్రాణాల పరిరక్షణ కోసం అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# హౌసింగ్‌లో అనర్హులను తొలగించండి

## ఎమ్మెల్యే గంటా ఆదేశం

**విశాఖపట్నం, జూన్ 24, జయ జయహే**

నియోజకవర్గంలో హౌసింగ్ లో అనర్హులను గుర్తించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సైబర్ వ్యాలీ, బక్కన్నపాలెం, ఓజోన్ వ్యాలీ, హుద్ హుద్ తదితర ఇళ్లల్లో లబ్ధిదారులు కాకుండా అనర్హులు ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొందరు వ్యక్తులు సిండికేట్ గా మారి ఒకొక్కరి చేతుల్లో 4 నుంచి 5 ఇళ్లు ఉంచుకోవడం వల్ల ప్రభుత్వ ఆశయం దెబ్బతింటోందని పేర్కొన్నారు. వారం రోజుల సమయంలో తనిఖీ నివేదిక అందజేయాలని, అనంతరం ఆయా ఇళ్లను సందర్శిస్తానని వెల్లడించారు. త్వరితగతిన తనిఖీలు పూర్తి చేయడానికి హౌసింగ్ అధికారులకు సహకరించాలని మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడిని ఆదేశించారు. తంగుడుబిల్లి, గిడిజాలలో పెద్ద సంఖ్యలో నిర్మించిన ఒక సెంటు ఇళ్లలో మౌలిక సౌకర్యాలు లేని కారణంగా ఎవరూ ఉండే పరిస్థితి లేదన్నారు. భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, హౌసింగ్ పీడీ సూరిబాబు, డీఈ రామకృష్ణ, ఏఈలు సూర్యప్రకాష్, శ్యాంసుందర్, శేషబాబు, ఉదయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.




### గ్రంధాలయాన్ని సందర్శించిన

## పౌర గ్రంథాలయ సంచాలకులు కృష్ణమోహన్

**గాజువాక (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకులు ఏ కృష్ణమోహన్ గాజువాక గ్రంథాలయాన్ని సందర్శించడమైనది.గ్రంథాలయంలో గల పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో వారి వివరాలు, వారు రాస్తున్న పోటీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన చదువరులు కోరిన పుస్తకాలు అందజేస్తామని అన్నారు. పుస్తకాలు చదువుట వలన మంచి ఉన్నత స్థితి కలిగి ఉంటారని విద్యార్థులకు సూచించారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ విద్యార్థులు అడిగిన కుర్చీలు ఇస్తామని, వారి యొక్క ఉన్నత స్థితికి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బుర్రి కుమార్ రాజు విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. గ్రంధాల అధికారిని బి సూర్య కళ యొక్క పనితీరును ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు




### సమస్యల పరిష్కారానికై

# ఆర్టిసి కార్మికుల ఆందోళన

**విజయనగరం (జయ జయహే)**

ఏపిపిటి డి రాష్ట్రజేఏసీ పిలుపు మేరకు ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ,విద్యుత్ బస్సులను ఆర్టీసీ లేదా ప్రభుత్వం కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యతను ఆర్టీసీకి అప్పగించాలని, ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయుటకు జరుగుతున్న ప్రయత్నాలు ఆపాలని ఉద్యమంలో భాగంగా రెండవ రోజు బుధవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.

# కూటమికి 'వెంకటాయపాలెం' సెగ..

## జగన్‌పై అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్సీపి కాపు నాయకుల ఆగ్రహం

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 24:**

వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రజా వ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతోందని వైఎస్సార్‌సిపి రాష్ట్ర కాపు నాయకులు హెచ్చరించారు. ఇటీవల రామచంద్రాపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన కాపు ఆత్మీయ సమావేశం విజయవంతం కావడంతో కూటమి నాయకుల్లో ఆందోళన మొదలైందన్నారు.స్థానిక వైఎస్సార్‌సిపి కార్యాలయంలో మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ గురుదత్త ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఎన్నికల మేనిఫెస్టోలో కాపుల సంక్షేమం కోసం ప్రకటించిన రూ.15 వేల కోట్ల హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రౌతు సూర్యప్రకాశరావు ఆరోపించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలు చేపడుతోందని విమర్శించారు.కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. విలువలు, విశ్వసనీయత ఉంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ప్రజా తీర్పు కోరాలని తోట త్రిమూర్తులు చేసిన సవాల్‌ను గుర్తు చేశారు. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, భాష అదుపులో పెట్టుకోవాలని సూచించారు.ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 10 శాతం కూడా అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారని



మేడ గురుదత్త ప్రసాద్ ఆరోపించారు. పవన్ కళ్యాణ్ ప్రతి సభలో కులాల ప్రస్తావన చేస్తూ సమాజంలో విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు.17 ఏళ్ల రాజకీయ జీవితంలో జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదని, అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అక్రమ అరెస్టులు, కక్షసాధింపు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.కాపు సమాజ సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గిరజాల బాబు, అడపా శ్రీహరి, యజ్జవరపు మరిడయ్య, గుర్రం గౌతం, చవాకుల సుబ్రహ్మణ్యం, మజ్జి అప్పారావు, రొక్కం త్రినాథ్, దూలం ప్రసాదరావు, నల్లమిల్లి సత్తిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదు

## కేంద్రం సంచలన ప్రకటన

**పౌరసత్వానికి అది కచ్చితమైన రుజువు కాదన్న విదేశాంగ శాఖ**


**ఇది కేవలం అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉద్దేశించిన పత్రం మాత్రమేనని స్పష్టీకరణ**

**పౌరసత్వ చట్టం ప్రకారమే ఈ వ్యాఖ్యలు చేసినట్లు ప్రభుత్వ వర్గాల వెల్లడి**

**కేంద్రం ప్రకటనపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ**

**ఆధార్, ఓటర్ ఐడీ కూడా పౌరసత్వానికి రుజువులు కావని గతంలోనే స్పష్టత**

**24(:జయ జయహే )**




మీ దగ్గర భారతీయ పాస్‌పోర్ట్ ఉందా? అది మీ దగ్గర ఉంటే మీరు భారత పౌరులని అధికారికంగా నిరూపితమైనట్టేనని భావిస్తున్నారా? అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన స్పష్టత మిమ్మల్ని విస్మయానికి గురిచేయక మానదు. "భారతీయ పాస్‌పోర్ట్ అనేది కేవలం అంతర్జాతీయ ప్రయాణాల కోసం జారీ చేసే ఒక ప్రయాణ పత్రం మాత్రమే కానీ, అది పౌరసత్వానికి పూర్తి స్థాయి రుజువు కాదు" అని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 14వ పాస్‌పోర్ట్ సేవా దివస్ వేడుకల సందర్భంగా విదేశాంగ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి ఈ వ్యాఖ్యలు చేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణల నేపథ్యంలో ఓటర్ లిస్ట్ నుండి తొలగించబడిన వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి పాస్‌పోర్ట్‌ను ఒక ఆధారంగా చూపించవచ్చా అని మీడియా అడిగిన ప్రశ్నకు అధికారి ఇలా సమాధానమిచ్చారు. సిద్ధాంతపరంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది విదేశాల్లో మీ జాతీయతను సూచిస్తుందే తప్ప, అది పౌరసత్వ పత్రం కాదని ఆయన వివరించారు.

**చర్చకు దారితీసిన ప్రకటన**

కేంద్రం చేసిన ఈ ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు, రాజకీయ దుమారానికి దారితీసింది. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య థాకరే ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. "కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది విడ్డూరంగా ఉంది. పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వ పత్రం కానప్పుడు, దానిని జారీ చేసే ముందు పోలీసులు ఎందుకు అన్ని వెరిఫికేషన్లు చేస్తారు? మన దేశం భారతీయులు కాని వారికి కూడా పాస్‌పోర్ట్‌లను ట్రావెల్ డాక్యుమెంట్లుగా ఇస్తుందా? ఈ ప్రకటన వల్ల విదేశాల్లో భారతీయ పాస్‌పోర్ట్ లీగాలిటీపై అనుమానాలు వచ్చే ప్రమాదం ఉంది" అని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు.

**ఏ పత్రానికీ ఆ గుర్తింపు లేదు!**

గతంలో సుప్రీం కోర్టుతోపాటు పలు హైకోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం.. భారతదేశంలో ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ బుక్ లేదా గ్రామ పంచాయతీ సెక్రటరీ ఇచ్చే సర్టిఫికెట్లు ఏవీ కూడా పౌరసత్వానికి తిరుగులేని ఆధారాలు కావు. ఇవన్నీ కేవలం ఒక వ్యక్తి గుర్తింపు, నివాస ధ్రువీకరణకు మాత్రమే పనికొస్తాయి. విదేశాల నుండి వచ్చి భారతదేశ పౌరసత్వం తీసుకునే వారికి మాత్రమే ప్రభుత్వం ప్రత్యేకంగా 'సిటిజన్‌షిప్ సర్టిఫికెట్' ఇస్తుంది, కానీ దేశంలో పుట్టిన వారికి అలాంటి ప్రత్యేక పత్రం ఏదీ ఉండదు.

**సాంకేతిక పురోగతిని వివరించిన కేంద్రం**

ఇదే సమావేశంలో విదేశాంగ శాఖ పాస్‌పోర్ట్ సేవల్లో సాధించిన మైలురాళ్లను పంచుకుంది. బయోమెట్రిక్ సమాచారంతో కూడిన, నకిలీలకు తావులేని 'చిప్ ఆధారిత ఈ-పాస్‌పోర్ట్'ల జారీ ప్రక్రియ వేగవంతమైందని, ఇప్పటివరకు సుమారు 1.47 కోట్ల ఈ-పాస్‌పోర్ట్‌లను జారీ చేసినట్లు వెల్లడించింది. అలాగే గత పదేళ్లలో పాస్‌పోర్ట్ కేంద్రాల సంఖ్య 77 నుండి 545 కు పెరిగిందని, దీనివల్ల కేవలం 6 వర్కింగ్ పనిదినాల్లోనే (పోలీస్ వెరిఫికేషన్ మినహాయించి) పాస్‌పోర్ట్ డెలివరీ అవుతోందని కేంద్రం పేర్కొంది.

# నార్త్ జోన్ మల్టీడే విజేత విశాఖ

**ప్రత్యర్థులపై విరుచుకుపడ్డ బ్యాటర్లు**

**బ్యాట్‌తో చెలరేగిన హర్ష గణేశ్**

**డబుల్ సెంచరీ సాధించిన హర్ష**

**రామ్ చరణ్, రిత్విక్ కూడా సెంచరీలు**

**(విశాఖపట్నం - జయజయహే)**





నార్త్ జోన్ మల్టీడే అండర్ - 16 ఛాంపియన్ గా విశాఖ జిల్లా జట్టు నిలిచింది. గత కొద్ది రోజులుగా విశాఖలోని ఉక్కు స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆడిన మూడు మ్యాచ్ లలో విశాఖ విజయాలు సాధించించింది. తూర్పు గోదావరి జట్టుతో జరిగిన చివరి మల్టీడే మ్యాచ్ లో ఇన్నింగ్స్ 500 పరుగుల భారీ తేడాతో ప్రత్యర్థిని మట్టికరించి ఛాంపియన్ గా నిలిచింది. మూడు రోజుల ఈ మ్యాచ్ లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన గోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్ లో 61 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి పరుగుల సునామీ సృష్టించు ఏకంగా ఆరు వికెట్ల నష్టానికి 749 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. దాంతో మళ్లీ బ్యాటింగ్ చేసిన రెండో ఇన్నింగ్స్ లోనూ 92 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌట్ కావడంతో విశాఖ జట్టు విజయం ఖాయమైంది.

**హర్ష రికార్డు**

ఈ మ్యాచ్ లో విశాఖ బ్యాటర్ హర్ష గణేష్ చెలరేగిపోయి డబుల్ సెంచరీ సాధించాడు. అతను మొత్తంగా 210 పరుగులు చేయగా రామ్ చరణ్ (119), రుత్విక్ (100) రాణించారు. భాను 46 పరుగులకే ఎనిమిది వికెట్లు తీసి అదరగొట్టాడు. కోచ్ పి.నాగరాజు శిక్షణలో ఈ జట్టు మొత్తం మీద మూడు మ్యాచుల్లో వరుస విజయాలతో 20 పాయింట్లు సాధించి నార్త్ జోన్ అంతర్ జిల్లా ఛాంపియన్షిప్ కైవసం చేసుకుంది.




## ఉచితంగా 'బి.పి', 'షుగర్' పరీక్షల

**విజయనగరం,,జూన్ 24(:జయ జయహే )**

అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక అయ్యన్నపేట చెరువు ప్రక్కనున్న మున్సిపల్ కార్పొరేషన్ నడక మైదానంలో క్వీన్స్ ఎన్.ఆర్.ఐ. హాస్పిటల్ వారి సౌజన్యంతో బి.పి.షుగర్ పరీక్షలను క్లబ్ అధ్యక్షులు సి.హెచ్ రమణ వాకర్స్ ఇంటర్నేషనల్ 40 సంవత్సరాల వేడుకల్లో భాగంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా హాజరైన డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఎ. తిరుపతి రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.వి.జి. శంకరరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతీ ఒక్కరు తరుచుగా బి.పి, షుగర్ పరీక్షలను చేసుకోని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని,ఆహార నియమాలను పాటించడం అవసరమని, ప్రజలంతా ఉప్పు వాడకాన్ని తగ్గించుకొని బిపి ను నియంత్రణలో ఉంచుకోవాలని, ఉదయాన్నే నడుస్తూ, వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచిస్తూ.. వాకర్స్ ఇంటర్నేషనల్ 40 సంవత్సరాలు వేడుకల్లో భాగంగాఅంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఇటువంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడాన్ని అభినందించారు.

క్వీన్స్ ఎన్.ఆర్. ఐ, పి.ఆర్. ఒ. సి.హెచ్. మోహనరావు, టెక్నీషియన్లు కుమారి లిఖిత,ప్రసాద్ సేవలందించిన ఈ శిబిరంలో సుమారు వందమంది ప్రజలు వైద్య సేవలను వినియోగించు కున్న ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 102 డిప్యూటీ గవర్నర్ తాడ్డి ఆదినారాయణ, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు, ప్రముఖ సామాజిక కార్యకర్త త్యాడ రామకృష్ణారావు(బాలు), జాలీ వాకర్ వై. నలమహారాజు, క్లబ్ ఉపాధ్యక్షులు పెనుమత్స అప్పలరాజు, జి. సూర్యప్రకాశరావు ఎస్పై, క్లబ్ కార్యదర్శి కోట్ల ఈశ్వరరావు,జాయింట్ కార్యదర్శి ఇందుకూరి అప్పలరాజు,యోగా గురువు సాలూరు చక్రధర్ పట్నాయక్,క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ,ఆర్. సి. హెచ్. అప్పలనాయుడు, కిలారి గోవిందరావు తదితర సభ్యులు భారీగా పాల్గొన్నారు.

## హ్యూమానిటీస్ విభాగంలో రాష్ట్ర టాపర్‌గా సోనాలికా రెడ్డి

**విశాఖపట్నం, జూన్ 24 (జయ జయహే )**



విశాఖపట్నానికి చెందిన ఎం.వి. సోనాలికా రెడ్డి,సిబిఎస్ఇ 12వ తరగతి బోర్డు పరీక్షలు--2026లో 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఇంగ్లీష్ మరియు పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో 100/100 మార్కులు సాధించింది. ఈ అద్భుత ఫలితాలతో హ్యూమానిటీస్ విభాగంలో విశాఖపట్నం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టాపర్‌గా నిలిచింది.అదేవిధంగా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ 2026లో దేశవ్యాప్తంగా 11 లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొనగా, సోనాలికా 99.8 పర్సెంటైల్ సాధించి మరో విశిష్ట విజయాన్ని అందుకుంది.సోనాలికా సాధించిన ఈ ఘన విజయంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## నరసాపురం డ్యామ్‌కు నిధులు మంజూరు

**కశింకోట (జయ జయహే)**

మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ .రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ అదేశాల మేరకు జనసేన పార్టీ ఇంచార్జ బీమరశెట్టి రామకృష్ణ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు సూచనల మేరకు అనకాపల్లి జిల్లా కసింకోట మండలశీ లో నరసాపురం డ్యాం మోటర్లు గేట్లు రోప్లు మరియు ఇతర రిపేర్ నిమిత్తం ఎనిమిది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ ప్రశాంతి కుమారి ఏ ఈ ప్రేమ్ కుమార్ నీటి సంఘం చైర్మన్ ఉప్పులూరి అప్పలనాయుడు . చంద్రశేఖర్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మజ్జి కుమార్ జనసేన నాయకులు కార్యకర్తలు సింహాద్రి మజ్జి సూర్యప్రకాష్ కసింకోట మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జెర్రిపోతుల నూకునాయుడు మసాలా నానాజీ చిట్టిబాబు మజ్జి ప్రసాద్ టెరపల్లి శ్రీను కోటినాయుడు కుమార్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు

For a pure tomorrow.. జయహో



## గుండె జబ్బుల బారిన పడొద్దంటే మీ వంటలో ఈ మార్పు తప్పక చేయండి

ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

%ఎముశ్రీష్ట్ర్ అజూం% : ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటలో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు. వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్తోపాటు మంట తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు. ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమతను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ కొలెస్ట్రాల్ను తగ్గించడంలో సాయపడుతుంది.

# క్యాన్సర్‌కు ముందు కనిపించే లక్షణాలు





**క్యాన్సర్ వ్యాధి ఒక ప్రాణాంతక వ్యాధి. ఈ వ్యాధి పేరు వింటేనే భయం ఆవహిస్తుంది. ఏటా లక్షలాది మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. చెడు జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా కూడా క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్టు అంచనా వేస్తున్నారు.**

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే విజయవంతంగా చికిత్స చేయవచ్చు. కానీ ప్రారంభ దశలో దీని లక్షణాలను గుర్తుపట్టడం అంత సులువు కాదు. ఎందుకంటే దాదాపు 90 శాతం మందికి అవి క్యాన్సర్ లక్షణాలు అని కూడా తెలియదు. అందుకే ప్రతి ఒక్కరూ క్యాన్సర్ ప్రారంభ లక్షణాలపై అవగాహన పెంచుకోవాలి.

వైద్యులు చెబుతున్న ప్రకారం.. నోటిలో తరచూ పుండ్లు ఏర్పడటం సాధారణ విషయం కాదు. ఇది క్యాన్సర్ జబ్బు చూపించే లక్షణాల్లో ఒకటి. ఈ ప్రీ క్యాన్సర్ లక్షణాన్ని వైద్యులు స్టేజ్ జీరో అని పిలుస్తారు. అయితే నోట్లో పుండ్లు అనేది కచ్చితంగా క్యాన్సర్ లక్షణమే అని చెప్పలేం. కానీ కొన్నిసార్లు మాత్రం అవి క్యాన్సర్ వల్లే వచ్చిన పుండ్లే కావచ్చు.

నాలుకపై తెల్లని మచ్చలు కనిపించినా దాన్ని క్యాన్సర్‌కు ముందు కనిపించే లక్షణంగా అనుమానించవచ్చు. కాబట్టి నాలుకపై తెల్ల మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇది కూడా స్టేజ్ జీరోలో కనిపించే సాధారణ లక్షణం. అయితే ఈ తెల్ల మచ్చలకు నోటి ఆరోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చు. తరచూ పొట్ట సంబంధిత వ్యాధులు వస్తున్నా కూడా తేలికగా తీసుకోవద్దు.

తరచూ మలబద్ధకం సమస్య కనిపిస్తున్నా కూడా జాగ్రత్తగా ఉండాలి. మళ్లీమళ్లీ మలబద్ధకం కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీ బరువు వేగంగా తగ్గుతున్నా కూడా తేలికగా తీసుకోవద్దు. అలా జరిగిందంటే మీ శరీరంలో ఏదో అసాధారణంగా జరుగుతోందని అర్థం. అలాంటి పరిస్థితిలో మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ఇవేగాక శరీరంపై ఎక్కడైనా గడ్డలా ఉన్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఆ గడ్డలు కూడా క్యాన్సర్‌కు ప్రారంభ సంకేతం కావచ్చు. మీ శరీరంపై పుట్టుమచ్చ లేదా మొటిమ ఉండి, అది అకస్మాత్తుగా పెరుగుతున్నా తేలికగా తీసుకోకూడదు. అది కూడా కొన్ని రకాల క్యాన్సర్లకు కారణమవుతుంది. తీవ్రంగా అలసిపోవడం కూడా క్యాన్సర్ లక్షణాలలో ఒకటి. కానీ చాలామందికి ఈ విషయం తెలియదు.

సాధారణంగా మనిషి అలసిపోతాడు. కానీ ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు అలసటగా అనిపిస్తున్నా, చిన్న పని చేయడానికి కూడా శక్తి లేనట్టు ఉన్నా జాగ్రత్త పడాలి. ఎక్కువ రోజులు ఇలా కొనసాగితే వైద్యులను సంప్రదించాలి. శరీరం రంగు నల్లగా మారడం లేదా ఎర్రగా మారి దురద పెట్టడం కూడా అసాధారణమైన క్యాన్సర్ లక్షణమే. ఈ విషయం కూడా చాలా మందికి తెలియదు.

చిన్నచిన్న గాయాలు అయినా మానకపోవడం, పుట్టమచ్చల సైజు పెరిగి పుండ్లుగా మారడం కూడా క్యాన్సర్ లక్షణమే కావచ్చు. గొంతు మారడం, విపరీతమైన దగ్గు రావడం కూడా క్యాన్సర్ లక్షణాలలో ఒకటే. మీ స్వరం మారిందంటే మీ శరీరంలో ఏదో తేడా ఉందని అర్థం చేసుకోవాలి. ఇక్కడ చెప్పిన ఏ లక్షణం మీలో ఉన్నా ఒకసారి వైద్యులను కలిసి జాగ్రత్త పడటం మంచిది.






# ముందే పసిగట్టేద్దాం

**మెనోపాజ్.. మహిళల్లో రుతుక్రమ ముగింపును సూచించే సహజమైన దశ. ప్రతి మహిళ జీవితంలో జరిగే ఓ సాధారణ ప్రక్రియ. అయితే, ఈ సమయంలో మహిళల శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయి. మానసికంగానూ తీవ్రమైన సంఘర్షణలు తలెత్తుతాయి. వాటన్నిటినీ సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే.. ఆ తర్వాతి జీవితం సాఫీగా సాగుతుంది. లేకుంటే.. అనేక ఒడుదొడుకులకు గురవుతుంది.**

సాధారణంగా మహిళలకు 45 నుంచి 50 ఏళ్ల మధ్య.. మెనోపాజ్ దశ మొదలవుతుంది. ఈ దశలో ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయులు తగ్గుతాయి. ఫలితంగా జీవక్రియలో క్షీణత, ఒత్తిడి ఎక్కువ అవుతుంది. కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ హార్మోనల్ మార్పులవల్ల చాలామందికి సరిగ్గా నిద్ర పట్టదు. ఎప్పుడూ చికాకుగా ఉంటారు. చిన్నచిన్న పనులకే అలసిపోతారు. శరీరం ఎక్కువగా వేడికి గురవ్వడం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలూ కనిపిస్తాయి. కాల్షియం స్థాయులు తగ్గిపోవడం వల్ల ఎముకలు బలహీనపడతాయి. ఈ ప్రభావాలన్నీ మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మానసికంగానూ ఇబ్బంది కలిగిస్తాయి. అయితే.. మెనోపాజ్ దశకన్నా ముందు వచ్చే పెరిమోనోపాజ్ దశ నుంచే ఈ మార్పులన్నీ ఒక్కొక్కటిగా బయటపడతాయి. అప్పుడే జాగ్రత్తపడితే.. మెనోపాజ్ దశలో ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించే అవకాశాలు ఉంటాయి.

### అలవాట్లు మార్చుకోవాలి..

40 ఏండ్లు దాటిన మహిళలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. మొదటగా శారీరక శ్రమ చేయడం అలవాటు చేసుకోవాలి. వాకింగ్, యోగాతో రోజంతా చురుగ్గా ఉండొచ్చు. మెటబాలిజాన్ని పెంచుకోవచ్చు. రోజూవారీ ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. తక్కువ కార్బొహైడ్రేట్లు, ఎక్కువ ప్రొటీన్ ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అంతేకాకుండా నిద్రకు కచ్చితమైన సమయాన్ని కేటాయించాలి. రోజూ నిర్ణీత సమయంలోగా నిద్ర పోవడం అలవాటుగా మార్చుకోవాలి. ఇలాంటి చిట్కాలు పాటిస్తే.. మెనోపాజ్ దశలో వచ్చే సమస్యలను సమర్థంగా ఎదుర్కోవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com